క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు


ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. దేవర అనంతరం తొలి ఆదివారం కావడంతో వేకువజామునుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పెద్దమ్మ తల్లీ దీవించు అంటూ అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండి వంటలు మొక్కుగా చెల్లించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉచిత ఆయుర్వేద శిబిరానికి విశేష స్పందన


ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ బాలకృష్ణ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని నీతు వైద్యశాల, పంచకర్మ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య భారతి, నంద్యాల శాఖ సహకారంతో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ బాలాజీ మర్చంట్స్ కమిటీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ శ్రావణి రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆయుర్వేద మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య భారతి సభ్యులు డాక్టర్ పరమేశ్వరరెడ్డి, టి.చెన్నకేశవులు, ఉమాదేవి, కె.విజయభాస్కర్ రెడ్డి, కొట్టె కృష్ణమూర్తి, మునీంద్ర, కృష్ణ, చింతలపల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడులో దంచికొట్టిన వర్షం


కొండాపురంలో సాగుచేసిన మినుము పంట

దొర్నిపాడు: మండలంలో వర్షం దంచి కొట్టింది. వాగులు వంకలు పొంగిపొర్లాయి. ఖరీఫ్‌లో సాగుచేసిన మినుము పంటకు ఈ వర్షం ప్రాణం పోసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలో 230 హెక్టార్లలో మినుము సాగుచేసినట్లు మండల వ్యవసాయాధికారి ప్రమీల తెలిపారు. ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. అలాగే మొక్కజొన్న సాగు కూడా ఈ ఏడాది పెరిగే అవకాశముందన్నారు.

వాల్మీకులను విస్మరిస్తున్న కూటమి సర్కారు


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ

నంద్యాల(అర్బన్): వాల్మీకుల సమస్యలను కూటమి సర్కారు విస్మరిస్తుందని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఎంవీఆర్‌పీఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ సాధించడంలో కూటమి ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు బోయ పులికొండన్న, పరమేష్, నిఖిల్,మధు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి చేయూత


ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

గోస్పాడు: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడికి తోటి స్నేహితులు చేయూతనందించారు. మండలంలోని ఒంటి వెలగల గ్రామానికి చెందిన విజయ్ గత రెండు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న 2004–2005 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు రూ.53 వేలు పోగు చేశారు. ఈమొత్తాన్ని ఆదివారం స్నేహితుడి ఇంటికి వెళ్లి అందించారు. కార్యక్రమంలో స్నేహితులు కాంతా రెడ్డి, వెంకటసుబ్బయ్య, ప్రసాద్, అంకన్న, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాల పిలుస్తోంది!

- ఈ నెల 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం
- వచ్చే నెల 1 నుంచి 3 రోజుల పాటు జిల్లా స్థాయిలో ఎంపికలు
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర స్థాయి ఎంపికలకు అర్హత


వేసవి శిక్షణ శిబిరంలో క్రీడాకారులు (ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): పిల్లలను చదువుకే పరిమితం చేయకుండా ఆటల్లో కూడా ప్రోత్సహించాలని నిపుణులు అంటారు. ఎందుకంటే వారి ఉజ్వల భవిష్యత్తుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఎంతో మంది తెలుగువారు క్రీడలతో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారు. చిన్నప్పటి నుంచి పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో మెరికలుగా తీర్చిదిద్దడానికి కడపలో క్రీడా పాఠశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ శిక్షణ పొందిన ఎంతోమంది ఆటల్లో రాణించి, ఉన్నత స్థాయికి వెళ్లారు. ఈ పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి (2025–26) 4, 5 తరగతుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నేపథ్యంలో క్రీడా పాఠశాలలో ప్రవేశాలు పొందిన వారికి మంచి భవిష్యత్తు లభించనుంది.

ఈనెల 19వ తేదీ వరకు దరఖాస్తు గడువు

క్రీడా పాఠశాలలో నాలుగో తరగతిలో 40 సీట్లు, ఐదో తరగతిలో 40 సీట్లకు సంబంధించి ఈ ఏడాది ప్రవేశాలను చేపట్టనున్నారు. ఒక్కో తరగతిలో 20 మంది బాలురు, 20 మంది బాలికలను తీసుకుంటారు. గతంలో మూడు దశల్లో (మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి) ఎంపికలను చేపట్టేవారు. ఈ ఏడాది నుంచి రెండు దశల్లో (జిల్లా, రాష్ట్ర స్థాయి) మాత్రమే ఎంపికలు నిర్వహిస్తారు. నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం 01-04-2015 నుంచి 31-03-2017 మధ్య జన్మించిన వారు, ఐదో తరగతిలో ప్రవేశాల కోసం 01-04-2014 31-03-2016 మధ్య పుట్టిన వారు అర్హులు. ఈ నెల 19వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. పూర్తి సమాచారం క్రీడా శాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

ఎంపికలు ఇలా..!

జిల్లా స్థాయి ఎంపికలను ఈ ఏడాది జులై 1 నుంచి 3వ తేదీ వరకు నంద్యాలలోని ఇండోర్ స్టేడియంలో చేపట్టనున్నారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, మెడిసిన్ బాల్, షటిలన్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, 600 మీటర్ల పరుగు లాంటివి నిర్వహిస్తారు. ఇందులో అభ్యర్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా జిల్లా స్థాయిలో ఎంపిక చేస్తారు. అనంతరం రాష్ట్ర స్థాయి శారీరక సామర్థ్య ఎంపికలను జులై 10, 11 తేదీల్లో నిర్వహిస్తారు. అందులో ప్రతిభ కనబరచినవారు క్రీడా పాఠశాలలో ప్రవేశం పొందేందుకు అర్హులుగా నిలుస్తారు. జులై 24 నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది.

క్రీడాకారులకు చక్కని వేదిక



క్రీడల్లో రాణించాలనుకునే వారికి క్రీడా పాఠశాల చక్కటి వేదిక. కార్పొరేట్ కంటే దీటుగా విద్యతో పాటు అనుభవజ్ఞులైన శిక్షకులతో శిక్షణ ఇస్తారు. ప్రవేశం దొరికితే మంచి భవిష్యత్తు ఉంటుంది. అన్ని సౌకర్యాలు ఉంటాయి. చదువు, క్రీడా శిక్షణ ఉచితమే. ఎంపిక పోటీలకు సంబంధించి కొన్ని మార్పులు ఉన్నాయి. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాల వస్తే తెలియపరుస్తాం.

–రాజు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి, నంద్యాల

భక్తజన సందడి


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

ఉయ్యాలవాడ : మండలంలోని ఇంజేడు గ్రామంలో గంగమ్మ తల్లి జాతర కనుల పండువగా సాగింది. చివరి రోజు ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి చీరె, పసుపు, కుంకుమ, బోనాలు, గండా దీపాలు మోసి నైవేద్యం సమర్పించి గంగమ్మ తల్లి చల్లగా చూడమ్మా అంటూ వేడుకున్నారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని, గ్రామం ప్రశాంతంగా ఉండాలని మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో భాగంగా గంగమ్మ తల్లి విశిష్టత గంగా కాటమరాజు కథను కళాకారులు భక్తులకు వినిపించారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


అమ్మవారికి సమర్పించేందుకు బోనాలతో తరలి వస్తున్న మహిళలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

క్రీడా స్ఫూర్తి అవసరం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న చిన్నపిల్లల వైద్యాధికారి డాక్టర్ ఆంజనేయులు

ఆళ్లగడ్డ: ప్రతి క్రీడాకారుడికి క్రీడాస్ఫూర్తి ముఖ్యమని.. దీంతోనే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని చిన్నపిల్లల వైద్యాధికారి డాక్టర్ ఆంజనేయులు అన్నారు. పట్టణంలో చేపట్టిన గ్రేటర్ రాయలసీమ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఆంజనేయులు గెలుపొందిన విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేసి మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు జాతీయస్థాయి పోటీలను లక్ష్యంగా నిర్దేశించుకొని ఆడాలని సూచించారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పట్టణంగా ఆళ్లగడ్డ అభివృద్ధి చెందుతుందన్నారు. భవిష్యత్‌లో ఇక్కడ మరిన్ని పోటీల నిర్వహణకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం


శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు మాంగళ్యధారణ గావిస్తున్న వేదపండితుడు


పల్లకీలో స్వామి,అమ్మవార్ల ఊరేగింపు దృశ్యం

చాగలమర్రి: మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి జన్మ నక్షత్రమైన శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం కదిరిపురం తండాకు చెందిన ఉభయదారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ అర్చకులు అనిల్ కుమార్, లోకేష్ శర్మ వేద మంత్రోచ్చారణలతో ఉదయం గణపతిపూజ, పుణ్యహవాచనం, కంకణపూజ, కంకణ ధారణ, పట్టు వస్త్రాల సమర్పణ చేపట్టారు. 11.30 నుంచి 12.45 గంటల మధ్య స్వామి కల్యాణం జరిపించారు. తర్వాత స్వామి అమ్మవార్లను పల్లకీలో ఊరేగించారు. భక్తుల సౌకర్యార్థం ఉభయదారుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామ్లీబాయ్, మహేశ్వరరెడ్డి, సుదర్శన్ రెడ్డి, కదిరిపురం తండాకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు.

గ్రామ సభల నిర్వహణతోనే గ్రామ స్వరాజ్యం

నంద్యాల(అర్బన్): గ్రామ సభలు నిర్వహించినప్పుడే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది శివపార్వతి తెలిపారు. స్థానిక ఐక్యవేదిక కార్యాలయంలో ఆదివారం జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి అధ్యక్షతన ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలైలో రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీలో వారం రోజుల పాటు గ్రామ సభలు నిర్వహించాలని కోరారు. ఈ సభల్లో ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా ఐక్యవేదిక మండల బాధ్యులు చొరవ చూపాలన్నారు. సమావేశంలో అనంతపురం జిల్లా అధ్యక్షుడు అల్తాఫ్, సాంబశివుడు, టీవీ రెడ్డి, ఆకుమల్ల రహీం, తదితరులు పాల్గొన్నారు.

గోరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

నంద్యాల(వ్యవసాయం): గో రక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని హిందూ దేవాలయల పరిరక్షణ సమితి సభ్యులు అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం వినాయక ఘాట్ వద్ద హిందూ దేవాలయల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గో సంస్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బసవరాజు, రామకృష్ణ రెడ్డి, నవీన్ గౌడ్‌లు మాట్లాడుతూ పండుగల పేరుతో వధించిన వేలాది గోవుల, ఎద్దులకు నివాళిగా ఈ సభ నిర్వహించినట్లు తెలిపారు. గోరక్షణ చట్టాలు ఉన్నా మూగజీవాలను కాపాడలేకపోతున్నామన్నారు. కార్యక్రమంలో హిందూ దేవాలయల పరిరక్షణ సమితి నాయకులు సుదర్శన్‌రెడ్డి, రాంచరణ్, శివ, ప్రతాప్, సతీష్, కల్యాణ్ ఆచారి, గణేష్ కేంద్ర సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంలో సినారెది ప్రత్యేక శైలి


కర్నూలు కల్చరల్: తెలుగు సాహిత్య రచనలో సినారెది ప్రత్యేక శైలి అని వక్తలు అన్నారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సినారె వర్ధంతితో పాటు సంగీత విభావరి నిర్వహించారు. సినారె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. సినారె రాసిన తెలుగు సినిమా పాటలు విశేష ప్రజాదారణ పొందాయన్నారు. ఆయన విశ్వంభర రచనకు జ్ఞానపీఠ్ అవార్డు లభించిందన్నారు. పద్మశ్రీ, పద్మ విభూషణ్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వంటి ఎన్నో అవార్డులు పొందారన్నారు. సుమారు 3 వేలకు పైగా పాటలు రచించారన్నారు. కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, గాయకులు సుధారాణి, బాలవెంకటేశ్వర్లు, శ్రీనివాసులు సినారె రచించిన పాటలను పాడి అలరించారు. కళాక్షేత్రం ఉపాధ్యక్షుడు సీవీ రెడ్డి, ఇనాయతుల్లా, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు పురస్కారాలు


పురస్కారాలు పొందిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని పెద్దబండ వీధిలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ సమితి ఆధ్వర్యంలో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సూర్యప్రకాష్ ఆచారి, నేషనల్ కాలేజ్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్, రిటైర్డ్ సీటీ పారుదల శాఖ డీఈ రాజశేఖర్ హాజరై మాట్లాడుతూ ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మంచి మార్కులు సాధించిన 18 విద్యార్థినీ విద్యార్థులకు పారితోషికం, మెమొంటో, నోటు పుస్తకాలు అందజేసినట్లు వెల్లడించారు. విశ్వబ్రాహ్మణ విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని విశ్వబ్రాహ్మణ సమితి సభ్యులు తెలిపారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, వాసు, విశ్వబ్రాహ్మణుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

కూలీలకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి


నూతనంగా ఎన్నికైన బాబాఫక్రుద్దీన్, రాధాకృష్ణ

నంద్యాల(న్యూటౌన్): ఉపాధి హామీ పథకం కూలీలకు వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాధాకృష్ణ, బాబాఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ప్రతి పేదవాడికి గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బాబాఫక్రుద్దీన్, రాధాకృష్ణను ఎన్నుకోగా ఉపాధ్యక్షులుగా ప్రతాప్, రంగనాయుడు, సంజీవులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హరినాథ్, జిల్లా సహాయ కార్యదర్శిగా ప్రతాప్‌తో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ నాయకులు మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పనులకు సంబంధించిన నిధులు సక్రమంగా విడుదల కావడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ఏపీటీఎఫ్ ధ్యేయం


మార్క్ బాలకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారామే ధ్యేయంగా ఏపీటీఎఫ్ పనిచేస్తుందని ఆ సంఘం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, మల్లెల పుల్లయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోపాల్‌రావు, జయరాం అన్నారు. ఆదివారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు, మాజీ శాసన మండలి సభ్యులు కామ్రేడ్ మార్క్ బాలకృష్ణ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ మార్క్ బాలకృష్ణ ఉపాధ్యాయ, రైతాంగ, సామాన్య ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేశారన్నారు. 12 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పని చేశారన్నారు. ఉద్యమ నేతగా నిస్వార్థంగా పని చేసిన మహోన్నత వ్యక్తి మార్క్ బాలకృష్ణ అని అన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు రాంప్రసాద్, వేంకటేశ్వర్లు, ఖలీల్ అహమ్మద్, బాలవేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే అవస్థే..!


క్రిష్టిపాడులోని ఎస్సీకాలనీలో కుంటలా మారిన దారి


చాకరాజువేములలోని ప్రధాన సెంటర్‌లో నిత్యం ఇలా

దొర్నిపాడు: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పల్లెల్లో రోడ్లు మురికి కుపాలుగా మారుతున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ వ్యవస్థ ఉన్నప్పటికీ అందులో పూడిక పేరుకుపోవడంతో వర్షం నీళ్లంతా రోడ్లపై పారుతున్నాయి. లోతట్టు ఉన్న చోట నిలిచిపోతున్నాయి. దీంతో దోమల బెడద పెరిగి రాత్రి పూట కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.సీజనల్ వ్యాధులు ప్రబలక ముందే అధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలని వారు కోరుతున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం


కట్టుబట్టలతో రోడ్డున పడిన మల్కి మహేంద్ర కుటుంబం


పూర్తిగా కాలిపోయిన గుడిసె

చాగలమర్రి: మండలంలోని డి.వనిపెంట పంచాయతీకి మజరా గ్రామమైన చెంచుగూడెంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి గుడిసె కాలిపోయింది. ఈ ఘటనలో బాధిత కుటుంబానికి సుమారు రూ.3.50 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళితే.. మల్కి మహేంద్ర కుటుంబ సభ్యులు శనివారం రాత్రి గుడిసెలో నిద్రిస్తున్నారు. హఠాత్తుగా అర్ధరాత్రి కరెంట్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు గుడిసెకు అంటుకున్నాయి. అందులో నిద్రిస్తున్న వారు గమనించి వెంటనే బయటకు పరుగులు తీశారు. అదే సమయంలో బలమైన గాలి వీచడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న సామాన్లు మొత్తం కాలి బుడిదయ్యాయి. బీరువాలోని రూ.3 లక్షలు విలువ చేసే బంగారు, వెండి వస్తువులు, రూ.45,000 నగదు అగ్నికి ఆహుతయ్యాయని బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు. సర్వం కోల్పోయిన తమకు ఆర్థిక సహాయం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని మల్కి మహేంద్ర వేడుకుంటున్నాడు.

జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఖాళీ!

- 9 నెలలుగా ఖాళీగా ఉన్నా పట్టించుకోని ప్రభుత్వం
- ఇన్‌చార్జ్‌లతో ముందుకు సాగని పాలన
- ఇబ్బందులు పడుతున్న క్రయ, విక్రయదారులు


జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే శాఖల్లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఒక్కటి. అయితే ఈ శాఖను ముందుకు నడిపే ఉన్నతాధికారులను నియమించడంలో రాష్ట్ర ప్రభు త్వం వైఫల్యం చెందింది. 9 నెలలుగా కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఖాళీగా ఉంది. ఇన్‌చార్జ్‌లతో పాలన ముందుకు సాగకపోవడంతో క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్న వైనం

2024 సెప్టెంబర్ 22వ తేదీ వరకు కర్నూలు జిల్లా రిజిస్ట్రార్‌గా నాగ మల్లీశ్వరరావు ఉండేవారు. అయితే ఆయన అప్పుడు ప్రభుత్వం జరిపిన సాధారణ బదిలీల్లో విశాఖపట్నం డీఆర్‌గా వెళ్లిపోయారు. దీంతో కొన్నాళ్లుగా జిల్లా రిజిస్ట్రార్‌గా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కర్నూలు డీఐజీ కల్యాణి ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించారు. తరువాత ఆమె ఆ బాధ్యతలు మార్కెట్ విలువల జిల్లా రిజిస్ట్రార్‌గా ఉన్న ఎం.చెన్నకేశవ రెడ్డికి అప్పగించారు. ఆయన కొన్నాళ్లు వినియోగదారులకు ఇబ్బంది లేకుండా నడిపారు. అయితే అతను ఏప్రిల్ నుంచి సెలవులో వెళ్లారు. జూలై 1వ తేదీ వరకు లాంగ్ లీవ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మళ్లీ ఆ స్థానాన్ని అనంతపురం జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్‌కు అప్పగించారు. ఇలా దాదాపు 9 నెలలుగా జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఖాళీగా ఉండడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తొంగిచూడని ఇన్‌చార్జ్ డీఆర్

ప్రస్తుతం ఇన్‌చార్జ్ డీఆర్‌గా ఉన్న అనంతపురం జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ ఇటువైపు తొంగి చూడడం లేదు. దీంతో జిల్లా రిజిస్ట్రార్ చేయాల్సిన సొసైటీలు, ఫార్మ్‌లు, రిజిస్ట్రేషన్లలో తప్పులకు సంబంధించి ఎడిట్ అండ్ ఇండెక్స్‌లు, వివిధ అక్రమ రిజిస్ట్రేషన్ల వివాదాలు, కేసులను జిల్లా రిజిస్ట్రారే పరిష్కరించాల్సి ఉంది. అయితే ఆయన అనంతపురం నుంచి కర్నూలుకు రావడం చాలా అరుదు. ఫలితంగా ఆయా అంశాలకు సంబంధించిన వివిధ రకాల ఫైళ్లు పేరుకుపోతున్నాయి. వినియోగదారులు నిత్యం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వైపు వచ్చి వెళ్తున్నారు. కొందరు అక్కడే ఉండి పడిగాపులు కాస్తున్నా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీల్లోనైనా కొత్త జిల్లా రిజిస్ట్రార్ వస్తాడునుకుంటే ఇప్పటి వరకు ఆ శాఖకు సంబంధించిన బదిలీల మార్గదర్శకాలు కూడా విడుదల కాలేదు. దీంతో క్రయ, విక్రయదారుల ఇబ్బందులు ఎప్పుడూ పరిష్కారం అవుతాయో తెలియడం లేదు.

ఆలయ కమిటీ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేశాం

మేము గ్రామంలో శివాంజనేయస్వామి దేవాలయాన్ని నిర్మించాలని తలచాం. ఇందుకోసం దాతల నుంచి చందాలు తీసుకోవడానికి స్వామి వారి పేరిట ఆలయ కమిటీ రిజిస్ట్రేషన్ కోసం నెలన్నర క్రితం రూ.512 చలానా కట్టాం. కమిటీకి మూడు రోజుల్లో ఆమోదం లభిస్తుందని చెప్పారు. అయితే ఇంతవరకు జిల్లా రిజిస్ట్రార్ అందుబాటులో లేకపోవడంతో ఏమీ చేయలేక పోతున్నాం. రోజూ కార్యాలయానికి వచ్చి వెళ్లడం తప్పా పని జరగడం లేదు.

– ఈ.ఎల్లాగౌడ్, మునగాలపాడు, కర్నూలు రూరల్ మండలం